క్లుప్తంగా

నాణ్యమైన భోజనం వడ్డించండి

రుద్రవరం: విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యంగా వడ్డించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని ఆలమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులతో పాటు ఆయన మధ్యాహ్న భోజనం రుచి చూశారు. భోజనం నాణ్యతగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఇలాగే వండి వడ్డించాలని చెప్పారు. అలాగే పాఠశాలలో సాగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.

డబుల్ ఓట్లపై విచారణ

శిరివెళ్ల: మండలంలో డబుల్ ఓటుపై విచారణ జరుగుతుందని తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ శనివారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కుకు ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టామన్నారు. అందులో 1800 మందికి వివిధ ప్రాంతాల్లో డబుల్ ఓటు ఉన్నట్లు నిర్ధారణయిందన్నారు. వాటిపై బూతులెవెల్ అధికారులు సమగ్ర విచారణ చేస్తున్నారని, డబుల్ ఓటులో తమకు ఇష్టమైన ప్రాంతంలో ఓటు ఉండాలని ఓటుదారుడు అంగీకార పత్రం ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే కొత్తగా 1200 ఓట్లు నమోదయ్యాయని, 200 మరణించిన వారి ఓట్లు తొలగించామని వివరించారు.

పకడ్బందీగా పేదరిక నిర్మూలన సర్వే

ఉయ్యాలవాడ : మండలంలోగ్రామీణ పేదరిక నిర్మూలనపై పకడ్బందీగా సర్వే చేపట్టనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో వీపీఏలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గుర్తించేందుకు ఇంటింటా తమ సిబ్బంది ద్వారా సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించేలా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగి ఉండి, బహిర్భూమికి వెళ్లకుండా ఉండటంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

దేశాన్ని కాపాడుకుందాం

నంద్యాల(అర్బన్): మతం ముసుగులో దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శనివారం పట్టణ నాయకులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలన్నింటినీ కార్పొరేట్లకు అప్పనంగా బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. ఏటా లక్షల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి..ఉద్యోగాల మాట మరిచిందన్నారు. నాయకులు తోటమద్దులు, పుల్లా నరసింహులు, లక్ష్మణ్, శివ, గోపాల్, జైలాన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుద్దమల్ల శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి వార్లకు భక్తులు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు కమలేశర్మ, అనంతయ్య, భాస్కరశర్మ, లక్ష్మణస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటేష్‌కు జీవిత సాఫల్య పురస్కారం



కోటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని ప్రముఖ చిత్రకారుడు కోటేష్‌కు జీవిత సాఫల్య పురస్కారం దక్కింది. రాష్ట్రస్థాయి చిత్ర కళా ప్రదర్శన పోటీల్లో చేసిన విశిష్ట సేవలకు గాను బెజవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా వినుకొండలో లయోలా హైస్కూల్‌లో శనివారం కోటేష్‌ను సత్కారించి జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. ట్రస్టు చైర్మన్ నాగేశ్వరరావు, ఏపీ కాకతీయ సేనా సమాఖ్య ప్రధాన కార్యదర్శి వెంకటరావు, నంద్యాల చిత్రకారులు సుంకన్న, ఓబులేసు, శీను తదితరుల నుంచి పురస్కారం అందుకున్నారు. కోటేష్ ఆర్ట్ అకాడమీకి చెందిన హేమకేష రాష్ట్రస్థాయి చిత్రకళా ప్రదర్శన పోటీల్లో ప్రథమ బహుమతిని ఈ సందర్భంగా నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, మంజునాథ్, అస్మిత, సాహిత్, మధురిమ, వాసుశ్రీ, మాన్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- తెల్లవారుజామునే గడప గడపకు తిరిగిన ఎమ్మెల్యే



లబ్ధి పొందిన సంక్షేమ పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): ఒక వైపు అభివృద్ధితో పాటు మరో వైపు ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం తెల్లావారుజామున 5 గంటలకే మండలంలోని మిట్నాల పంచాయతీ పరిధిలో బి.శివరామపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం మది నుంచి జాలువారిన నవరత్నాల పథకాలను ప్రతి గడపకు చేరుతున్న తీరు అద్భుతమన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేందుకు పటిష్టమైన వ్యవస్థలను రూపొందించి, అమలు చేస్తున్న తీరు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టించే కుయక్తులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం అర్హతే ఆధారంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పింఛన్ మొత్తాన్ని పెంచి ఇస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇంతటి సంక్షేమాన్ని ముందెన్నడూ చూడలేదని వారు ఆనందం వ్యక్తం చేస్తుండటం చూస్తే జగనన్న పట్ల వారి అభిమానం ఏస్థాయిలో ఉందో అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమ, అభివృద్ధి కొనసాగాలని, ఇందుకు ప్రజలు జగనన్న పట్ల ఆదరాభిమానాలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు తిరుపతిరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ భాస్కర్, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

ఆళ్లగడ్డ: ఈ నెల 24వ తేదీ మండల కేంద్రం చాగలమర్రిలోని వెలుగు కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైకేపీ ఏసీ దానం శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్ సంయుక్తంగా జాబ్ మేళాను నిర్వహిస్తాయని చెప్పారు. బీటెక్, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ..

నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి పి.వి.ప్రతాప్‌రెడ్డి శనివారం తెలిపారు. శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల జీటీఆర్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. మూడు నెలల శిక్షణ సమయంలో ఉచిత బస్‌పాస్‌తో పాటు అన్ని వసతులు ఉచితంగా కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 23వ తేదీన కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఉద్యాన పంటలకు 75 శాతం రాయితీ



పేరూరులో టమాటా పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

రుద్రవరం: ఉద్యాన వన పంటలు సాగు చేసే రైతులు ఏపీఐఐఏటీపీ అనే పథకం ద్వారా ప్రభుత్వం75 శాతం రాయితీ ఇస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి నరేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పేరూరులో శనివారం ఆయన సర్పంచు దేవదానం, గ్రామ సచివాలయ కన్వీనర్ తిరుపతిరెడ్డితో కలిసి పూలు,పండ్లు,కూరగాయలు సాగు చేసిన రైతులతో మాట్లాడి తోటల వద్దకు వెళ్లి తోటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి పంటల వారీగా ప్రభుత్వం అందించే రాయితీలను వివరించారు. హైబ్రిడ్ కూరగాయలు సాగుకు ఒక హెక్టారుకు రూ.37,500, మామిడికి రూ.24,938, జామకు రూ.54,998, అరటికి రూ.76,847, పూల తోటలకు రూ.30,వేల ప్రకారం రాయితీ అందిస్తోందని చెప్పారు. మొదటి విడతగా ఈ పథకం కింద పేరూరు, చిన్నకంబలూరు, చందలూరు గ్రామాలను మాత్రమే ఎంపిక చేసిందని ఆ మూడు గ్రామాల రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- సమస్యలను చూసి పారిపోయే తత్వం కాదు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గంగుల



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు ప్రజల సంక్షేమానికి కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు అమలు చేస్తున్నారని, అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కూడా కొనసాగిస్తూ ఆదర్శ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంటలోని 5వ వార్డు సచివాలయ పరిధిలోని టీబీ రోడ్డు ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలతో ప్రతి గడపలో ప్రజలు వంద శాతం సంతృప్తితో ఉన్నారన్నారు. తాము సమస్యలను చూసి పారిపోయే రకం కాదని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వంద శాతం విజయం సాధించామన్నారు. ప్రజల ముంగిటకే సంక్షేమ పథకలు తీసుక రావాలనే సంకల్పంతో గ్రామ సచివాలయ వ్యవస్థతో పాటు, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నామని, వారి నుంచి ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయని, అందుకే ఈ విధానంపై దేశంలో వివిధ రాష్ట్రాలు అధ్యయనం చేసి అమలుకు చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. పథకాల ద్వారా ప్రతి ఇంటికి గడిచిన మూడేళ్లలో రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. ఆనంతరం ఆయన ప్రతి గడపకు తిరిగి పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, నజీర్, యాదవాడ నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సత్వర న్యాయమే లోక్‌అదాలత్ ఉద్దేశం



మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ఉద్దేశమని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు తెలిపారు. కోర్టు ఆవరణలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను న్యాయ స్థానాల్లో కాకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందని, అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులు, తీర్పుపై అప్పీలు ఉండదని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11న జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహమ్మద్ రఫీ, శ్రీనివాసమూర్తి, బోయ సుబ్బరాయుడు, రాజగోపాల్‌రెడ్డి, మద్దిలేటి, ప్రసాద్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జయంతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కల్పనా సెంటర్‌లో శ్రీ కాశిరెడ్డినాయన ఆశ్రమంలో శనివారం కాశిరెడ్డినాయన జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం యథావిధిగా అన్నదానం చేశారు. ఆశ్రమ గౌరవ చైర్మన్ డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నంద్యాల(అర్బన్): వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాల నియంత్రణకు పాటు పడాలని ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ శ్రీకాంత్ కోరారు. 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శాంతిరాం ఆసుపత్రి వైద్య సిబ్బంది వాహన చోదకులకు షుగర్, బీపీ, ఈసీజీ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీని వాహనదారులు విడుదల చేశారు. ఎంవీఐ రవిశంకర్ నాయక్, ఏఓ సువర్ణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి

నంద్యాల(వ్యవసాయం): యోగి వేమన జయంతి వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని హనీఫ్ నగర్‌లోని రోటరీ పాఠశాలలో చిన్నయ్యసూరి సాహితీ సమితి ఆధ్వర్యంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు వైష్ణవ వెంకటరమణమూర్తి మాట్లాడుతూ జీవితంలోని అనుభవాలను, ఆట వెలుగుల పద్యాలతో అలవోకగా సమాజానికి అందించారన్నారు. సమాజ మార్పునకు ఆయన పద్యాలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో పద్యాలు చెప్పి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ సుబ్బయ్య, మజ్జిగ దత్తన్న, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

24న ఎడ్యుకేషనల్ ఎఫిఫనీ మెరిట్ టెస్ట్

నంద్యాల(సిటీ): ఎడ్యుకేషనల్ ఎఫిఫనీ సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న మెరిట్ టెస్ట్ ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రిలిమినరీ పరీక్షల మెరిట్ టెస్ట్ రాయాల్సి ఉందన్నారు. ఈ ప్రిలిమినరీ పరీక్షల్లో 50 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు ఈ నెల 31న జరిగే మెయిన్స్ పరీక్షలకు అర్హులన్నారు. మెయిన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలలో రూ.9లక్షల నగదు బహుమతులు అందజేస్తారన్నారు. వివరాలకు9573139996, 9666747996 నంబర్లను సంప్రదించాలన్నారు.

25న టెంకాయల వేలం

బండిఆత్మకూరు: ఈనెల 25న ఓంకార క్షేత్రంలో టెంకాయల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. టెంకాయల వేలంతో పాటు ఐస్‌క్రీమ్ బండ్లు, దీపారాధన, అభిషేక వస్తువులు విక్రయించుకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు.

నీటి హక్కు సాధనకు పోరాడాలి



మాట్లాడుతున్న ప్రహ్లాద రెడ్డి

గోస్పాడు: తాగు, సాగునీటి హక్కు సాధన కోసం పోరాడాలని ఇందుకు.. ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం సాగునీటి సాధన సమితి రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ నీటి వాటా కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగుగంగ, కేసీ కెనాల్‌కు నీరు రావాలంటే శ్రీశైలం జలాశయంలో నీరు నిల్వ ఉండాలన్నారు. అక్కడి నీటిని ఎగువ ప్రాంతమైన రాయలసీమకు దక్కకుండా దిగువ ప్రాంతాలకు తరలిస్తున్న విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. కృష్ణానది, తుంగభద్ర నదుల ద్వారా ప్రభుత్వం రాయలసీమకు హక్కుగా కేటాయించిన నీటి వాటా దశాబ్దాలుగా అందడం లేదని, నదులలో పుష్కలంగా నీరు ప్రవహిస్తున్నా ఫలితం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మించి ఉంటే రాయలసీమ కరువుకు దూరమయ్యేదన్నారు. ఈనెల 28న నిర్వహించే చలో సిద్దేశ్వరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు నాయకులు చంద్రమోహన్ రెడ్డి, మహేంద్ర మహిపాల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సాయి ధీరజ్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

నంద్యాల(అర్బన్): ఎండీయూ రేషన్ వాహనాలకు సంబంధించిన బీమా మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇవ్వడంపై సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటామని ఎండీయూల అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఖాజా శ్రీనివాసులు తెలిపారు. ఒక్కో వాహనానికి రూ.18వేల ఇన్సురెన్స్ మొత్తాన్ని ఎండీయూ (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) అకౌంట్లలో జమ చేయడం పట్ల అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక కార్యాలయ ఆవరణలో శనివారం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న తమకు ఎండీయూ వాహనాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. నాయకులు రమణ, వెంకటస్వామి, గోపాల్, ఆంథోని, శీను, సుభాన్, చాంద్‌బాషా, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కళకళలాడుతున్న ఆవాల పైరు



కళకళలాడుతున్న ఆవాల పైరు

గోస్పాడు: మండలంలోని ఎస్.నాగులవరం, నెహ్రూ నగర్, జిల్లెల్ల, యాళ్లూరు, కానాలపల్లె, గోస్పాడు, ఏం చింతకుంట్ల తదితర గ్రామాల్లో రైతులు ఆవాల పంట సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం 908 హెక్టార్లు కాగా ఈ ఏడాది 690 హెక్టార్లలో పంట సాగైందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పైరు పూత దశలో ఉండి పచ్చగా కళకళలాడుతోంది. సాధారణంగా ఖరీఫ్ వరి కోతల అనంతరం రబీ సీజన్‌లో భాగంగా ఆవాలు సాగు చేస్తారు. ఇందుకు ఇతర పంటలతో పోల్చుకుంటే పెట్టుబడి తక్కువగా ఉండటం, చీడపీడల బాధ లేకపోవడం, శ్రమ తక్కువగా ఉండటం, పంట కాలం 90 రోజులే కావడంతో ఈ పంట సాగుకు మొగ్గు చూపుతారు. నంద్యాల–కోయిలకుంట్ల రహదారి వెంట పొలాల్లో సాగు చేసిన ఆవాల పైరు సువాసనలు వెదజల్లుతూ, ఆకు పచ్చని మొక్కలకు పసుపు పచ్చని పూతతో కనువిందు చేస్తోంది.

భక్తి శ్రద్ధలతో వాసవీమాతకు క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొదటి రోజు శనివారం అమ్మవారికి క్షీరాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఆవుపాలతో ప్రత్యేకంగా క్షీరాభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు మాట్లాడుతూ ఆదివారం అమ్మవారికి రుద్రాక్ష పూలతో ప్రత్యేక అలంకారం, శ్రీవాసవీ సామూహిక వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జలాభిషేకం, విశేష ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకం, సామూహిక కుంకుమార్చన, మహిళా మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

నమో నారసింహ



స్వామివార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు గ్రామంలో రెండు రోజులుగా పార్వేట ఉత్సవాలు జరుగుతున్నాయి. శ్రీ జ్వాలా నరసింహ, శ్రీ ప్రహ్లాదవరద స్వాములు పల్లకీలో కొలువుండి వివిధ తెలుపులై ఆశీనులు కాగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ పల్లకీ రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సవ మూర్తులకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యే పూజలు చేశారు. ముందుగా ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

యాగంటి క్షేత్రాన్ని దర్శించుకున్న ప్రముఖులు

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి క్షేత్రాన్ని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డితో పాటు తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేంద్ర వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, అర్చకులు మహేశ్వరమ్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వరస్వామికి అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయం మేరకు అర్చకులు ఎమ్మెల్యేలను పూలమాలు, దుశ్శాలువాలతో సన్మానంచి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుడ్డాశ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తలంబ్రాల వడ్ల వలుపు



కోదండ రామాలయంలో వడ్లు వలుస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): భద్రాచలంలో జరగబోయే సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాల యజ్ఞంలో భాగంగా పట్టణంలోని పలు రామాలయాల్లో వడ్లను గోటితో వలిచే కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మన ఊరు–మనగుడి, మన బాధ్యత నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, రాంప్రసాద్ మాట్లాడుతూ భద్రాద్రి సీతారాముల కల్యాణానికి కోరుకొండ నుంచి వడ్లను తీసుకొచ్చామని, వాటిని వలిచి తలంబ్రాలుగా ఉంచుతారన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల రామాలయాల్లో కార్యక్రమం ప్రారంభమైందని, ఈనెల 30వ తేదీలోపు ముగుస్తుందని చెప్పారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: శిరివెళ్ల మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన వంకదార లక్ష్మీదేవి అనే మహిళకు సీఎం సహాయ నిధి నుంచి రూ.1.10 లక్షలు మంజూరు కావడంతో ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి శనివారం స్థానిక పార్టీ కార్యలయంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హుసేన్‌బీ, నాయకులు గుర్రప్ప, సుబ్బసత్యనారాయణ పాల్గొన్నారు.

26న వసంత పంచమి వేడుకలు

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రథమనంది వద్దనున్న గాయత్రి దేవాలయంలో ఈనెల 26వ తేదీన వసంత పంచమి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడు కరణం మురళీ కృష్ణారావు శనివారం తెలిపారు. సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే మహోత్సవంలో ఉదయం 8గంటలకు సరస్వతి హోమం, వేదమాత శ్రీగాయత్రి ఆలయంలో అక్షరభ్యాసం నిర్వహిస్తామని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు కంకణ, పెన్నుల పంపిణీతో పాటు ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

బైకుల దొంగ అరెస్టు

దొర్నిపాడు: బైకుల దొంగతనాకి పాల్పడుతున్న అబ్దుల్ ఖలీల్ అనే వ్యక్తిని శనివారం దొర్నిపాడు శివారులోని కేసీ కెనాల్ గట్టు వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన ఖలీల్ మూడు బైకులను దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. ఎట్టకేలకు బైకులను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.